క్లుప్తంగా

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

బుక్కరాయసముద్రం: మండలంలోని కొర్రపాడు గ్రామంలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం సాయంత్రం 4 గంటలకు జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అంకే నరేష్ తెలిపారు. కార్యక్రమానికి అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు తప్పక హాజరు కావాలన్నారు.

చెత్తను డంపింగ్ యార్డులోనే వేయండి



సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ మల్లికార్జున

గుంతకల్లుటౌన్: ఇంటింటా సేకరించిన చెత్తను తప్పనిసరిగా డంపింగ్‌యార్డులోనే అన్‌లోడ్ చేయాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున క్లాప్ ఆటోడ్రైవర్లను ఆదేశించారు. సోమవారం ఉదయం కమిషనర్ డంపింగ్‌యార్డును పరిశీలించారు. డోర్ టు డోర్ కలెక్షన్‌లో భాగంగా చెత్తను సేకరించి ఆటోను కంపోస్టుయార్డుకు తీసుకురావాలన్నారు. సేకరించిన చెత్తను డంపింగ్‌యార్డుకు కాకుండా ఖాళీ ప్రదేశాల్లో పడేస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న ఆలూరి రమణారెడ్డి

బుక్కరాయసముద్రం: వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆలూరి రమణారెడ్డి కుమార్తె నమ్రత పుట్టినరోజును పురస్కరించుకొని సచివాలయం-4లో పంచాయతీ కార్మికులకు దుస్తుల పంపిణీ, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముందుగా పంచాయతీ కార్మికుల మధ్య కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. ఆలూరి రమణారెడ్డి మాట్లాడుతూ తన కుమార్తె పుట్టిన రోజున ఏటా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల సహకార సంఘం సొసైటీ అధ్యక్షులు వెంకటరెడ్డి, సర్పంచ్ పార్వతి, ఎంపీటీసీ కాలువ వెంకటలక్ష్మి, మాజీ ఎంపీపీ రాజశేఖర్‌రెడ్డి, ఉప సర్పంచ్ వరలక్ష్మి, పూల నారాయణస్వామి, చికెన్ నారాయణస్వామి , కొండమ్మ, ముత్యాలశీన పురుషోత్తం, నందినేని మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధిపై సమావేశం



మాట్లాడుతున్న ఎంపీడీఓ వీరరాజు

యల్లనూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ పంచాయతీల అభివృద్ధిపై సోమవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ వీరరాజు మాట్లాడుతూ ప్రతి పంచాయతీలోనూ సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ విజయశేఖర్ నాయుడు, ఏపీఓ షబ్బీర్‌బాషా, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి విలువిద్య పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన చిత్రచేడు హైస్కూల్ విద్యార్థులు

పెద్దవడుగూరు: మండల పరిధిలోని చిత్రచేడు జెడ్పీ పాఠశాల విద్యార్థులు సలీం, మంజునాథ్ రాష్ట్రస్థాయి విలువిద్య పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఇటీవల బుక్కరాయసముద్రం మండలం కొర్రపాడు పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి ఎస్జీఎఫ్ విలువిద్య ఇండియన్ రౌండ్ విభాగంలో విద్యార్థులు సత్తా చాటారన్నారు. వీరు మన్యం జిల్లాలోని పార్వతీపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. అలాగు అండర్-14 జిల్లా స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు 8వ తరగతి విద్యార్థులు సురేంద్ర, మంజునాథ్, సూర్యవంశీ ఎంపికైనట్లు తెలిపారు.

13న మండల సర్వసభ్య సమావేశం

శింగనమల: మండల సర్వసభ్య సమావేశం ఈనెల 13న ఎంపీపీ యోగేశ్వరి అధ్యక్షతన జరగనున్నట్లు ఎంపీడీఓ నిర్మలాకుమారి తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు హాజరుకావాలన్నారు.

సురక్షతో ఇంటి వద్దకే వైద్యం



గార్లదిన్నె మండలం కల్లూరు-3 గ్రామ సచివాలయంలో సురక్ష కిట్లు అందజేస్తున్న దృశ్యం

గార్లదిన్నె: కల్లూరు-3 గ్రామ సచివాలయ పరిధిలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్ర మం నిర్వహించారు. మెడికల్ క్యాంపునకు హాజరైన వారందరికీ వైద్య పరీక్షలు నిర్వ హించి, మందులు పంపిణీ చేశారు. అనంతరం గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉషారాణి, ఎంపీడీఓ విజయ భాస్కర్, స్పెషల్ డాక్టర్లు, పీహెచ్‌సీ డాక్టర్లు, ఎంపీటీసీ సభ్యులు నాగరత్న, జయలక్ష్మి, కోఆప్షన్ మెంబర్ బాబా యూనీస్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శింగనమల: నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. బుక్కరాయసముద్రం మండలంలోని కొర్రపాడు-1,2 సచివాలయాలు, గార్లదిన్నె మండలంలోని ఎర్రగుంట్ల, నార్పల మండలంలోని శిద్దరాచెర్ల, పుట్లూరు మండలంలోని కడవకల్లు, శింగనమల మండలంలోని సీ బండమీదపల్లి, యల్లనూరు మండలంలోని కూచివారిపల్లి సచివాలయాల్లో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

రామగిరిలో..

పామిడి: మండలంలోని రామగిరి గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఈఓఆర్డీ బీవీ శశికళ సోమవారం తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అధికారులు, అనధికారులు, వైఎస్ అభిమానులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు. అలాగే 11వ తేదీ రామరాజుపల్లి, 12న కండ్లపల్లి, 17న పాళ్యం, 19న పాళ్యంతండా, 20న ఎద్దులపల్లి, 21న పామిడి మదీనా ఏరియా-1, 24న మదీనా ఏరియా-2, 25న ఎద్దులపల్లి రోడ్డు ఏరియా, 26న అంబేద్కర్ కాలనీ, 27న పీ కొండాపురం, 28న తలవాలకట్ట ఏరియా, 31వ తేదీ గుప్తాకాలనీ ఏరియాలో ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తామన్నారు. వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

నేడు యర్రగుంట్లలో..

గార్లదిన్నె: మండలంలోని యర్రగుంట్ల గ్రామ సచివాలయ పరిధిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయ భాస్కర్ ఓ ప్రకటనలో తెలిపారు.

నేడు తురకపల్లిలో..

గుత్తి రూరల్: మండలంలోని తురకపల్లిలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివాజీరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామంలోని విలేజ్ హెల్త్ క్లినిక్ వద్ద ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి వైద్యులు, ఆరోగ్య సిబ్బంది హాజరవుతారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

289 మందికి వైద్య పరీక్షలు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని గాంధీ నగర్‌లోని సచివాలయం-4 పరిధిలో మేజర్ పంచాయతీ సర్పంచ్ పార్వతి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 289 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. వైద్య పరీక్షలు చేసుకున్న వారికి వైద్యులు ఆరోగ్య సంరక్షణపై సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, మండల సహకార సంఘం సొసైటీ అధ్యక్షుడు వెంకటరెడ్డి, ఆలూరి రమణారెడ్డి, గువ్వల రాజశేఖర్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వెంకటరెడ్డి పల్లిలో..

తాడిపత్రిటౌన్: మండలంలోని వెంకటరెడ్డిపల్లిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రంగారావు తెలిపారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి

యాడికి: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు, యువ నాయకుడు కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం మండలంలోని ఓబుళాపురం గ్రామంలో జన చైతన్య యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గడప గడపకూ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆయా కుటుంబాలకు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్లు అందించారు. గ్రామంలోని సమస్యలను తెలుసుకుని, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, సీనియర్ నాయకుడు భోగాతి బ్రహ్మానందరెడ్డి, నాయకులు లక్ష్మీరెడ్డి, కోనా జగదీశ్వర రెడ్డి, కోనా వెంకటశివారెడ్డి, కోనా దేవనాథ రెడ్డి, రవికుమార్, శివారెడ్డి, కండోజీరావు, పుల్లారెడ్డి, గోవర్ధన్, రంగారెడ్డి, లక్ష్మినారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

20న వాల్మీకి విగ్రహ ప్రతిష్ట



వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

యాడికి: తాడిపత్రిలోని యల్లనూరు రోడ్డు మలుపు వద్ద ఈనెల 20న వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, ఎంపీ తలారీ రంగయ్య ఆవిష్కరిస్తారని వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సజ్జలదిన్నె రాజు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని చెన్నకేశవ స్వామి దేవాలయ ఆవరణలో వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్టకు సంబంధించిన వాల్ పోస్టర్లను విడుదల చేశారు. విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి వాల్మీకులు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు నాగేష్, తిరుపతి, కంబగిరి స్వామి, కుమార్, బాల పెద్దయ్య, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: తాడిపత్రి పట్టణంలోని యల్లనూరు రోడ్ సర్కిల్‌లో ఈనెల 20న వాల్మీకి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు వాల్మీకి కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ సజ్జలదిన్నె రాజు, వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర కార్యదర్శి హనుమంతు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వాల్మీకి విగ్రహం వద్ద వాల్‌పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో మండల వాల్మీకి నాయకులు శేఖర్, నరసింహులు, రామాంజనేయులు, పోతులయ్య, పడిగిలప్ప, నారాయణ స్వామి, కండ్లగూడూరు ఈశ్వరయ్య, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ పిచికారీపై అవగాహన



తాడిపత్రి మండలం దిగువపల్లిలో డ్రోన్ పనితీరుపై వివరిస్తున్న అధికారులు

తాడిపత్రిటౌన్/బుక్కరాయసముద్రం: మండలంలోని దిగువపల్లి గ్రామంలో సోమవారం డ్రోన్ ద్వారా పురుగుమందుల పిచికారీపై రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. గ్రామానికి చెందిన ప్రతాప్‌రెడ్డి ఆముదం పొలంలో పిచికారి నిర్వహించి తక్కువ టైంలో తక్కువ ఖర్చుతో డ్రోన్‌ను ఉపయోగించుకొవచ్చని తెలిపారు. అలాగే డ్రోన్ వాడకం వల్ల వ్యవసాయ కూలీల ఖర్చు తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో రెడ్డిపల్లి వ్యవసాయ కృషి విజ్ఞాన కేంద్రం, రేకులకుంట వ్యవసాయ పరిశోదన సంస్థ శాస్త్రవేత్తలు సహదేవరెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, కిషోర్‌కుమార్, తాడిపత్రి ఏడీఏ చంగల్‌రాయుడు, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

డ్రిప్పు వాడకంలో జాగ్రత్తలు అవసరం

• ఏపీఎంఐపీ పీడీ ఫిరోజ్ ఖాన్



రైతులకు అవగాహన కల్పిస్తున్న పీడీ ఫిరోజ్‌ఖాన్

బుక్కరాయసముద్రం: డ్రిప్పు, స్ప్రింక్లర్ల వాడకంలో రైతులు జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని ఏపీ ఎంఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఫిరోజ్ ఖాన్ తెలిపారు. సోమవారం మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో రైతులకు డ్రిప్పు స్ప్రింక్లర్లు వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. పీడీ ఫిరోజ్‌ఖాన్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు రాయితీలతో డ్రిప్పు పరికరాలు మంజూరు చేస్తోందన్నారు. డ్రిప్పు, స్ప్రింక్లర్ల వాడకంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం పంపిణీ చేసే పరికారాల్లో ఏజెన్సీలు ఆలస్యం చేస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తే ఏపీఎంఐపీ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలన్నారు. ప్రభుత్వం రాయితీతో మంజూరు చేసిన డ్రిప్పు, స్ప్రింక్లర్లను రైతులు తప్పనిసరిగా పొలాల్లో అమర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎంఐపీ మైక్రో ఇరిగేషన్ ఇంజినీరు కరుణ, మైక్రో ఇరిగేషన్ ఏరియా ఆఫీసర్ హరిత, పారగాన్ కంపెనీ రీజినల్ కోఆర్డినేటర్ సురేంద్ర, డీలర్ చిన్నపరెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు ఆరు వినతులు

గుత్తి రూరల్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ప్రజల నుంచి ఆరు వినతులు అందినట్లు తహసీల్దార్ మహబూబ్‌బాషా తెలిపారు. ఇంటి పట్టాలు, పట్టాదారు పాసు పుస్తకం, పొలం కొలతలు, మ్యుటేషన్లపై రైతుల నుంచి ఫిర్యాదులు వచ్చాయని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో డీటీ లలిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పావతి పాల్గొన్నారు.

యల్లనూరు: తహసీల్దారు కార్యాలయంలో జరిగిన స్పందనలో ప్రజల నుంచి మూడు వినతులు వచ్చినట్లు తహసీల్దారు సుమతి తెలిపారు. అనంతరం వృద్ధాప్య పింఛన్‌కోసం ఒకటి, పట్టాదారు పాసుపుస్తకం కోసం ఒకటి, ఇంటి నిర్మాణానికి ఒక అర్జీ వచ్చిందన్నారు. ఎంపీడీఓ వీరరాజు, ఎంఈఓ చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈ సుప్రజ, ఏపీఎం ముత్యాలప్ప, అంగన్‌వాడీ, ఆరోగ్య సూపర్‌వైజర్లు రాజామణి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో శౌర్య జాగరణ యాత్ర

అనంతపురం కల్చరల్: విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ చేపట్టిన శౌర్య జాగరణ యాత్ర సోమవారం అనంతకు చేరుకుంది. భారీ ఎత్తున తరలివచ్చిన వీహెచ్‌పీ కార్యకర్తలు, ఆర్‌ఎస్‌ఎస్ స్వయం సేవకులు భాజాభజంత్రీలతో జై శ్రీరామ్ నినాదాలు చేస్తూ రథయాత్రకు స్వాగతం పలికారు. నాట్యాచార్యులు దేవరకొండ కౌసల్య నేతృత్వంలో కళాకారులు సంప్రదాయ కోలాటం చేస్తూ అందరిలో హుషారు నింపారు. పాతూరు చెరువుకట్ట వినాయక స్వామి ఆలయం నుంచి నగర వీధుల్లో రథయాత్ర సాగింది. సనాతన ధర్మ పరిరక్షణే ధ్యేయంగా రథయాత్ర సాగుతోందని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు అక్కిశెట్టి జయరామ్ రాయల్, చిన్మయామిషన్ జిల్లా ఇన్‌చార్జ్ స్వామి ఆత్మవిదానంద సరస్వతి అన్నారు. విశ్వహిందూ పరిషత్తు ఆవిర్భవించి 60 ఏళ్లు దాటడం శుభపరిణామన్నారు. శౌర్య జాగరణ యాత్ర ద్వారా అందరినీ హైందవ ప్రచారం దిశగా జాగృతం చేయడానికి స్వామీజీలు తరలివస్తున్నట్లు తెలిపారు.

పశు వైద్య శిబిరాలకు స్పందన



కూడేరు: మాట్లాడుతున్న డాక్టర్ సుధాకర్

రాయదుర్గం రూరల్: మండలంలోని డి.కొండాపురం గ్రామంలో వాటర్ షెడ్ సౌజన్యంతో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించినట్లు డాక్టర్ జి.వెంకటేష్ తెలిపారు. వాటర్ షెడ్ కాంపోనెంట్ ప్రధానమంత్రి కృషిసంచాయి యోజన 2.0 అనే పథకం కింద 28 పశువులకు చూలు పరీక్షలు చేయగా, 10 పశువులు చూలు కట్టినట్లు గుర్తించామన్నారు.18 పశువులు గొడ్డు మోతు సమస్యతో బాధపడుతున్నట్లు నిర్ధారించామన్నారు. అలాగే పశువులు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేశామన్నారు. కార్యక్రమంలో పశువైద్యులు ఎ.శిరీష, రమేష్, వాటర్ షెడ్ పీఓ శ్రీవిద్య, టెక్నికల్ అధికారులు ఈరన్న, విశ్వేశ్వర, వాటర్ షెడ్ చైర్మన్ ఆంజనేయులు పాల్గొన్నారు.

కూడేరు: మండలంలోని కలగళ్లలో సోమవారం ప్రధానమంత్రి కృషి సంచాయీ యోజన పథకం కింద వాటర్ షెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత పశు వైద్య శిబిరాన్ని విశేష స్పందన లభించింది. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్య నిర్వాహణాధికారి(డీఎల్‌డీఏ ఈఓ) డాక్టర్ సుధాకర్ పశువులకు వైద్య సేవలు అందించారు. రైతులకు ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం పాడి రైతులకు దాణా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాటర్ షెడ్ టీఓ విశ్వనాథ్‌రెడ్డి, చైర్మన్ భాస్కర్ రెడ్డి, మండల పశు వైద్యాధికారి శ్రీనివాసులు, గోపాల మిత్రలు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

యల్లనూరు: యల్లనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 48 మంది గర్భిణులకు డాక్టర్ లోకేష్ కుమార్ వైద్య పరీక్షలు చేశారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులకు అవసరమైన పరీక్షలు, మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మధుకుమార్, సూపర్‌వైజర్ విజయలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారమే భూ సేకరణ చేపట్టాలి

గుంతకల్లు రూరల్: మండలంలో పవర్ గ్రిడ్ ఏర్పాటు కోసం జరుగుతున్న భూసేకరణ ప్రక్రియ నిబంధనల మేరకే చేపట్టాలని కోరుతూ భారతీయ జనతా యువమోర్చ ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. జిల్లా జనరల్ సెక్రటరీ వి.మంజుల వెంకటేష్ మాట్లాడుతూ మండలంలో పవర్‌గ్రిడ్ ఏర్పాటు కోసం తిమ్మాపురం, దోనిముక్కల పొలాల్లో భూసేకరణ కోసం రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహిస్తున్నారన్నారు. సమాచారం ఇవ్వకుండా చేపడుతున్న ఈ పనుల వల్ల రైతులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. అంతేకాకుండా కొందరు రైతులను తహసీల్దార్ కార్యాలయానికి పిలిపించి బలవంతంగా సంతకాలు చేయిస్తున్నారన్నారు. రైతులకు ఇబ్బంది కలగకుండా నిబంధనల మేరకే భూసేకరణ చేపట్టాలని వారు కోరారు.

నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న యాడికి సర్కిల్ సీఐ శంకర్‌రెడ్డి

పెద్దవడుగూరు: మండలంలోని హోటల్ యజమానులు పోలీసులు విధించిన నిబంధనలను తప్పకుండా పాటించాలని యాడికి సర్కిల్ సీఐ శంకర్‌రెడ్డి, ఎస్‌ఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో హోటల్ యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాత్రి సమయాల్లో వాహనాలను రోడ్డు లో అడ్డంగా నిలపకుండా చూసుకోవాలని సూచించారు. హోటళ్లను నిర్ణీత సమయంలో మూసి వేయాలన్నారు. సీసీ కెమెరాలను తప్పకుండా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక

ఉరవకొండ: స్థానిక ప్రభుత్వ ఎస్‌కే ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం వీరన్న, వైస్ హెచ్‌ఎం బాషా, పీడీలు అష్రాఫ్‌హుసేన్, రాజేష్ తెలిపారు. వారు మాట్లాడుతూ అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల క్రీడామైదానంలో ఈనెల 7న నిర్వహించిన జిల్లా స్థాయి అండర్-14, -17 విభాగాల బాస్కెట్‌బాల్ పోటీల్లో విద్యార్థులు ఎస్.మెహమూద్, నవకిరణ్ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. నవంబర్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో వారు పాల్గొంటారన్నారు. ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

నేరాలపై అవగాహన



మాట్లాడుతున్న పట్టణ సీఐ హమీద్ ఖాన్

తాడిపత్రి: పట్టణంలోని ట్రిపుల్ ఎస్ ప్రభుత్వ మున్సిపల్ పాఠశాల విద్యార్థులకు సోమవారం పట్టణ సీఐ హమీద్‌ఖాన్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈవ్ టీజింగ్‌కు ఎవరైనా పాల్పడినా, ఆ దిశగా ఎవరైనా ప్రయత్నం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే 9440796861 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ పాల్గొన్నారు.

రేపు వాహనాల వేలం

గుత్తి: పట్టణంలోని సివిల్ పోలీసు స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలు, సెబ్ పోలీసు స్టేషన్ పరిధిలో పట్టుబడిన ద్విచక్ర వాహనాలకు బుధవారం వేలం వేస్తున్నట్లు సివిల్ సీఐ వెంకటరామిరెడ్డి, సెబ్ సీఐ వరలక్ష్మి సోమవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఉదయం 10 గంటలకు వేలం నిర్వహిస్తామన్నారు. ఔత్సాహికులు డిపాజిట్టు చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. వివరాలకు పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు

యాడికి: మండల కేంద్రంలోని కోన రోడ్డులోని చౌడేశ్వరీ కాలనీ రహదారిలో మండల కేంద్రానికి చెందిన రాంభూపాల్, ప్రసాద్‌కు చెందిన రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఇద్దరూ గొడవ పడుతుండటంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ గురు ప్రసాద్ రెడ్డి అక్కడికి చేరుకుని ఇద్దరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ప్రభుత్వ భూములు పంచాలి

పెద్దవడుగూరు: మండలంలో వ్యవసాయ భూమిలేని పేదలకు ప్రభుత్వ భూములను 8వ విడుతలో అందించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కత్తుల కొండయ్య, రామాంజినేయులు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. కొండూరు, వీరన్నపల్లి గ్రామాల్లోని ఇళ్లు లేని పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వ భూమి కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గంజిగుంటపల్లి వద్ద ఉన్న మెగా సోలార్ ప్లాంటుకు భూములు కోల్పోయిన వారికి ఉపాధి కల్పించడంలో ప్లాంటు యాజమాన్యం మోసం చేసిందని తెలిపారు. కార్యక్రమంలో మండల ఎమ్మార్పీఎస్ నాయకులు భూపతి, కుమార్, రంగస్వామి, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

మట్కా బీటర్ అరెస్ట్

తాడిపత్రి: రూరల్ పరిధిలోని గన్నెవారిపల్లి కాలనీలో మట్కా నిర్వహిస్తున్న గురిశెట్టి సంజీవరాయుడు అనే బీటర్‌ను సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి రూ.56 వేల నగదు, మట్కా చిట్టీలతో పాటు అక్రమంగా విక్రయించేందుకు సిద్ధంగా ఉంచుకున్న 60 క్వార్టర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు చేసినట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఫార్మాసిస్టుకు గాయాలు

శింగనమల: తరిమెల పీహెచ్‌సీలో పని చేస్తున్న ఫార్మాసిస్టు నల్లప్ప సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అనంతపురం నుంచి ద్విచక్ర వాహనంలో కల్లూరు మీదుగా తరిమెల పీహెచ్‌సీకి వెళ్తుండగా, మార్గంమధ్యలో మరో ద్విచక్రవాహనం ఢీకొనింది. ఈప్రమాదంలో అతనికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు.

మట్కా, పేకాటపై నిఘా పెట్టండి

యల్లనూరు: మండలంలో ఎక్కడైనా మట్కా, పేకాట ఆడుతున్నట్లు తెలిస్తే సమాచారం అందించాలని పుట్లూరు సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. సీఐ మాట్లాడుతూ మట్కా, పేకాట ఆడినా, ప్రోత్సహించినా సహించేదిలేదన్నారు. రౌడీషటర్లపై నిఘా పెంచామన్నారు. గ్రామాల్లో ప్రశాంత జీవనం సాగించాలన్నారు. ఫ్యాక్షన్‌ను ప్రేరేపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పారిశుధ్యం మెరుగు పరచండి

గుంతకల్లుటౌన్: పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగుపరిచి ప్రజలు అనారోగ్యాల బారిన పడకుండా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునను సీపీఎం నాయకులు కోరారు. సోమవారం కమిషనర్‌ను సీపీఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు, నాయకులు రమేష్, నాగరాజ్, తిమ్మప్ప తదితరులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. పట్టణంలో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారని, శివారు, మురికివాడల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు చేయించాలని వారు కోరారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయించాలన్నారు.

బీఎస్సీ కెమిస్ట్రీ హానర్స్ కోర్సు మంజూరు

గుంతకల్లుటౌన్: స్థానిక ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నాలుగేళ్ల బీఎస్సీ కెమిస్ట్రీ(హానర్స్) కోర్సు మంజూరైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మయ్య సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మూడేళ్ల బీఎస్సీ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు నేరుగా నాలుగో సంవత్సరంలో ప్రవేశానికి అర్హులన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ నెల 14లోగా కళాశాల కెమిస్ట్రీ విభాగంలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ట్యాంకుల నిర్మాణాలు పూర్తి చేయాలి

తాడిపత్రి: పట్టణంలోని పలు ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి. పట్టణ ప్రజలకు తాగునీటిని అందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఐ నాయకులు సోమవారం మున్సిపల్ కమిషనర్ రవికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో చేతి వృత్తిదారుల నియోజకవర్గ కార్యదర్శి సూరి, ఏఐటీయూసీ నాయకులు రమణ, పట్టణ సహాయ కార్యదర్శులు శ్రీరాములు, రామాంజి, నాగేంద్ర, రత్నమయ్య, అబ్రహం, నాయక్, సంజన తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

కళ్యాణదుర్గం: ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జగన్నాథ్ సూచించారు. కేంద్ర యువజన మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు జాతీయ సేవా పథకం నేతృత్వంలో గాంధీ జయంతి వారోత్సవాల్లో భాగంగా సోమవారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ సభ్యులతో కలిసి ప్రిన్సిపాల్ మొక్కలు నాటారు. కాలుష్యాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఆయన సూచించారు. అనంతరం మొక్కల సంరక్షణ మనందరి బాధ్యత అంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అధ్యాపకులు జయలక్ష్మి, బాపూజీ, ఓబిలేశు పాల్గొన్నారు.